## క్లుప్తంగా

### తహసీల్దార్ బదిలీ


రాజేశ్వరరావు

కొయ్యూరు: తహసీల్దార్ డి.రాజేశ్వరరావుకు విజయనగరం జిల్లా బొండపల్లి బదిలీ అయింది. ఆయన కొయ్యూరు నుంచి మంగళవారం రిలీవ్ అయ్యారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన మార్చి నెలలో కొయ్యూరు వచ్చారు. అతనిని విజయనగరం జిల్లాలో బొండపల్లికి బదిలీ చేశారు. కొయ్యూరుకు తహసీల్దార్‌గా ఎవరిని నియమించలేదు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సీతారామ్‌నకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

### మూడవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో మూడవ తరగతిలో ప్రవేశాలకు 48 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీ గిరిజన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం నేరుగా పాఠశాలలో సంప్రదించవచ్చని చెప్పారు.

### పింఛన్ల పంపిణీపై సమావేశం

మారేడుమిల్లి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో ఎంపీడీవో ఎ.వీర కిషోర్ మంగళవారం పింఛన్ల పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ పంపిణీని ఉద్యోగులు బాధ్యయుతంగా చేపట్టాలని, ఇందులో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని 2008 మంది లబ్ధిదారులకు సుమారు రూ.83,14,500 నగదును పింఛన్లు పంపిణీకి ప్రభుత్వం మండలానికి మంజూరు చేసినట్టు తెలిపారు. ఎనిమిది గ్రామ సచివాలయ పరిధిలోని 76 మంది సచివాలయం సిబ్బంది ఒక టోవ తేదీన ఇంటి వద్దకు వెళ్లి ఫించన్ అందజేస్తారని తెలిపారు.పరిపాలన అధికారి పి.జయంతి, విస్తరణాధికారి పి.విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

### భవిత కేంద్రం పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఐఈ కో–ఆర్డినేటర్ భాస్కరరావు

జి.మాడుగుల: మండలంలో గల దివ్యాంగ పిల్లల వివరాలు సేకరించి భవిత కేంద్రాలకు వచ్చేలా చొరవ చూపాలని అల్లూరి జిల్లా ఐఈ కో–ఆర్డినేటర్ కె భాస్కరరావు ఆదేశించారు. జి.మాడుగుల మండల కేంద్రంలో గల భవిత కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. కేంద్రం నిర్వహణపై ఆరా తీశారు. కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. భవిత కేంద్రం నిర్వహణ పట్ల ఆయన ఐఈ ఆర్‌పీలు రాజు, సరోజనీలకు పలు సూచనలిచ్చారు.

### గ్రామస్తుల శ్రమదానం


ప్రమాదకరంగా ఉన్న మట్టిని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు

మారేడుమిల్లి: మండలంలోని సున్నంపాడు పంచాయతీ కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు కలసి మంగళవారం స్వచ్ఛందంగా శ్రమదానం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్త చెదారాన్ని శుభ్రం చేశారు. రహదారి ఇరువైపులా దట్టంగా ఉన్న తుప్పలను తొలగించారు. ప్లాస్టిక్, వ్యర్థాపదార్థాలను, ఖాళీ మద్యం బాటిల్స్‌ను శుభ్రం చేశారు. వర్షాలకు రోడ్డుపైకి వరదనీరు చేరి మట్టి పేరుకుపోయింది. వీటి వల్ల వాహనాదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిని ఎవరు కూడా పట్టించుకోకపోవడంతో సిబ్బంది స్వయంగా మట్టిని తొలగించారు.

### అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

జి.మాడుగుల: మండలంలో కుంబిడిసింగి పంచాయతీ వెన్నెలకోట గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ బి.అక్కమ్మ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమె ఆకస్మిక మృతికి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శు, నాయకులు తదితరులు సంతాపాన్ని తెలియజేశారు.



# మందకొడిగా ఖరీఫ్ పనులు

- తెరిపివ్వని వర్షాలు
- పొలాల్లో వర్షపునీరు
- వరినాట్లు పనుల్లో ఆలస్యం


నారు పనుల్లో గిరిజన మహిళలు

రాజవొమ్మంగి: భారీ వర్షాల కారణంగా రంపచోడవరం డివిజన్‌లోని ఏడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ వరినాట్లు (వరి ఊడ్పులు) ఆలస్యంగా పడుతున్నాయి. ఈ ఏడాది తొలకరిలో తీవ్రమైన ఎండలు, ఆ తరువాత ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలతో వరినారు మడులు తయారు చేయడంలో ఆలస్యం జరిగిందని రైతులు చెబుతున్నారు.

**ఆందోళనలో రైతులు**

కాగా ఇప్పుడిప్పుడే వరి ఆకులు పెరగడంతో రాజవొమ్మంగి, అడ్డతీగల, దేవీపట్నం తదితర మండలాల్లో వరి నాట్లు నెమ్మదిగా ప్రారంభమయ్యాయి. కాగా రంపచోడవరం డివిజన్‌లో భారీ వర్షాల కారణంగా ఇప్పటి వరకు పది శాతం నాట్లు కూడా పడలేదని జిల్లా వ్యవసాయ అధికారి నంద్ మంగళవారం తెలిపారు. తుపాను కారణంగా గత పదిరోజులుగా ఎడతెరిపివ్వని వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాలు నీట మునిగాయి. పంటల నష్టపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల పొలాల్లో వర్షపునీటిని తొలగింపు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

**విస్తారంగా వరి సాగు**

నియోజకవర్గ వ్యాప్తంగా వరి సాగుకు సంబంధించి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం అధికారులు అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మారేడుమిల్లి మండలంలో 407 హెక్టార్లకు గాను ఇప్పటి వరకు 3 ఎకరాల్లోను, దేవీపట్నం మండలంలో 1419 హెక్టార్లకు గాను 7 హెక్టార్లలో, వై.రామవరం మండలంలో 922 హెక్టార్లకు గాను 12 ఎకరాల్లో, రాజవొమ్మంగి మండలంలో 2264 హెక్టార్లకు గాను 20 హెక్టార్లలో గంగవరం మండలంలో 1370 హెక్టార్లకు గాను 103 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. కాగా రంపచోడవరం సాధారణ వరి సాగు విస్తీర్ణం 1338 హెక్టార్లు, అడ్డతీగల మండలంలో 1324 హెక్టార్లకు గాను ఇప్పటి వరకు ఇంకా నాట్లు మొదలు కాలేదని అధికారులు తెలిపారు. కాగా ఇప్పటికే కొన్ని చోట్ల వరినారు పెరిగి తీతకు అనుకూలంగా ఉండడంతో ఒకటి రెండు రోజుల్లో వరినాట్లు ఊపందుకొంటాయని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా నాలుగు విలీన మండలాల్లో వరి సాగు సాధారణ విస్తీర్ణం 1063 హెక్టార్లు కాగా వరదల కారణంగా ఇంకా ఎక్కడా నాట్లు పడలేదు.


దుక్కి పనులు చేస్తున్న రైతులు


వరినాట్లు వేస్తున్న గిరిజనులు

### వాతావరణం అనుకూలం



ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో ఖరీఫ్ సీజన్ పనులు జోరందుకున్నాయి. కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పొలాలు నీట మునిగాయి. వర్షపునీరు తొలగింపు పనుల్లో నిమగ్నమై ఉన్నాం. కొన్ని చోట్ల వరినాట్లు వేస్తున్నారు. పంటలు కాపాడుకునేందుకు వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. – గోరా పోతురాజు, రైతు, అప్పలరాజుపేట, రాజవొమ్మంగి

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


అరకులోయలోని గిరిజన సంక్షేమ పాఠశాలను సందర్శించిన ఎంపీపీ ఉషారాణి, నాయకులు


వేములోవ ఆశ్రమ పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీకృష్ణారెడ్డి తదితరులు

అరకులోయ రూరల్: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, ఎంపీటీసీ సభ్యుడు దురియా ఆనంద్‌కుమార్, ప్రజాప్రతినిధులు మంగళవారం సందర్శించారు. పాఠశాల ప్రాంగణాన్ని, గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. లక్ష్యంతో కష్టపడి చదివి ఉన్నతులుగా ఎదగాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తాగునీటి సమస్యను ప్రిన్సిపాల్ వెంకటరమణ, సిబ్బంది విన్నవించారు.దీనిపై ఎంపీపీ ఉషారాణి తక్షణమే స్పందించి ఎంపీపీ నిధులతో బోరు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. **నర్సింహరావు, పూర్ణ, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.**

గంగవరం: మండలంలోని వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను, పిడతమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం సందర్శించారు. వేములోవ ఆశ్రమ పాఠశాలలో వసతి గృహం గదులు, తరగతి గదులు, మరుగుదొడ్లను ఎంపీపీ కృష్ణారెడ్డి పరిశీలించారు. మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని ఎంపీపీ దృష్టికి సిబ్బంది సమస్యను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడారు. వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పిడతమామిడి పీహెచ్‌సీని సందర్శించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని పిడతమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిని సూచించామన్నారు.వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, వంటశాల నిర్మాణానికి ఐటీడీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లు నేషం మరిడమ్మ, కుంజం లక్ష్మి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, నెల్లిపూడి ఎంపీటీసీ పెబ్బిలి కనకలక్ష్మి, మొల్లేరు సొసైటీ మాజీ డైరెక్టర్ పండా సిద్దార్థ, వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీష్, అర్జున్ తదితరులున్నారు.

### బస్సు సర్వీసు కోసం వినతి

గంగవరం : మండలంలోని గ్రామస్తులు సుదూర ప్రాంతాలైన వైజాగ్, కాకినాడ, అన్నవరం, జగ్గంపేట వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని , జగ్గంపేట–నెల్లిపూడి బస్సు సర్వీసును గంగవరం వరకు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరినట్టు గంగవరం మండల జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సిద్దు, నాయకులు వెంకటరాయుడు, కంగల శివ తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం గోకవరం ఆర్టీసీ డిపో అధికారికి వినతిపత్రాన్ని అందించినట్టు చెప్పారు. త్వరలోనే ఈ విషయంపై చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారని సిద్దూ తెలిపారు.

### వైఎస్సార్‌సీపీ నేత కుమార్ మృతికి సంతాపం


ధనపాల కుమార్(ఫైల్)

ఎటపాక: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ధనపాల కుమార్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎటపాక పంచాయతీ రాజుపేటకు చెందిన ఈయన పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేసి, సొంత ఖర్చులతో గ్రామంలో వైఎస్సార్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. పార్టీకి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన మృతదేహాన్ని పార్టీ మండల కమిటీ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

### రాజకీయ కక్షతోనే ఎంపీటీసీపై భూదందా ఆరోపణలు

ఎటపాక: రాజకీయ కక్షలతోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లిపాక ఎంపీటీసీ బూరం అంజలి పై భూదందా ఆరోపనలు చేస్తున్నారని గిరిజన(నాయకపోడు) రైతులు కొయ్యల వెంకటయ్య,కొయ్యల సీతారామయ్య,ముక్కయ్య,బురం వెంకటప్పయ్య, సుశీల,పిట్టల రాంబాబు మంగళవారం తెలిపారు. గోగుబాక గ్రామ పరిధిలో ఉన్న భూములపై గత కొంతకాలంగా ఎంపీటీసీపై కొందరు రాజకీయ కుట్రలతో నిందలు వేస్తున్నారు. దీనిపై సంబంధిత భూములు సాగుచేసుకుంటున్న రైతులు స్పందించారు. భూములు సాగుచేసుకుంటుండగా తమ భూములు లాక్కునేందుకు గ్రామానికి చెందిన తెలంగాణాలో రెవిన్యూ శాఖలో పనిచేస్తున్న ఓవ్యక్తి ప్రోత్సలంతో కొందరు తమపై దాడులు చేసి భూములు లాక్కునే కుట్ర చేస్తున్నారని రైతులు వివరించారు. తమ భూములకు ఎంపీటీసీ అంజలికి ఎటువంటి సంబంధంలేదని అట్టి భూములు ఎన్నో ఏళ్లుగా తమ ఆధీనంలోనే ఉన్నాయన్నారు.

# వర్షానికి కూలిన ఇల్లు


చంపాపుట్టులో వర్షానికి కూలిన ఇల్లు

ముంచంగిపుట్టు: మండలంలో గల రంగబయలు పంచాయతీ చంపాపుట్టు గ్రామంలో మంగళవారం ఉదయం వర్షానికి సీసా సోమ అనే గిరిజనుడి ఇల్లు స్వల్పంగా కూలింది.వరపు నీరుతో ఇంటి మట్టి గొడ తడిసిపోయి పడిపోయింది. ఇంటి పైకప్పు రేకులు దెబ్బతిన్నాయి. ఇంటిని ఇటీవలే కట్టుకున్న సోమకు.. వర్షంతో కూలిపోవడంతో నిల్వ నీడ లేకుండా పోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని, ఆర్థిక సహాయం అందించాలని బాధితుడు సోమ కోరాడు. ఈ విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి భర్త దేవ చంపాపుట్టు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరమర్శించారు. జరిగిన నష్టంపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.ప్రభుత్వం సోమకు నూతన గృహాన్ని మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# బాల్య వివాహాలతో అనర్థాలు


వేములోవ ఆశ్రమ పాఠశాలలో ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో లక్ష్మి తదితరులు

గంగవరం : వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీఓ సిహెచ్.లక్ష్మి ఆధ్వర్యంలో బచావో, భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు బాల్య వివాహాలు, చిన్నపిల్లల హక్కులు, చట్టాలు, ఫోక్సో చట్టం గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా బాల్యవివాహాల వాటివల్ల కలిగే పరిణామాలు, పోషకాహారం, 100 మిషన్ శక్తి ప్రోగ్రాం గురించి అవగాహన కలిగించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం నాగమణి, సూపర్‌వైజర్లు సత్యవతి, జయలక్ష్మి, అంఘన్‌వాడీ వర్కర్ కె.లక్ష్మి, ఉపాధ్యాయులు సూకరత్నం, సునీత, మీనాకుమారి ఉన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎటపాక: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లిపాక పీహెచ్‌సీ వైద్యుడు ప్రత్యూష్ సూచించారు. మండలంలోని ఎటపాక, మేడువాయి, రాజు పేట గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశా రు. అనంతరం సీజనల్ వ్యాధులైన డెంగి ,మలేరియా, డయేరియా, ఇతర వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వ్యాధులను మొదటి దశలోనే గుర్తించి, ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకోవాలని చెప్పారు. ఇళ్ల పరిసరాల్లో మురుగునీటి గుంతలు లేకుండా చూసుకోవాలని అన్నారు.పీహెచ్ఎన్ అరుంధతి, సిబ్బంది లలిత, మహేశ్వరి, గంగరాజు, పార్వతి, తిరుపతమ్మ, నవీన్ తదితరులున్నారు.

### కౌలు రైతులకు గుర్తింపు కార్డులు


ఏవో ఉమాదేవి

కొయ్యూరు : అర్హులైన ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్నామని, దర ఖాస్తు చేసుకోవాలని కొయ్యూరు వ్యవసాయాధికారి ఉమాదేవి చెప్పారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతి రైతు సేవా కేంద్రాల్లో కౌలు రైతులకు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు అందుబాటులో ఉంచామన్నారు. అర ఎకరానికి పైగా సాగు చేస్తున్న రైతులందరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్డు పరిమితి 11 నెలలు ఉంటుందన్నారు. గుర్తింపు కార్డుల వల్ల రైతులకు పంటలకు బీమాతో పాటు ప్రకృతి వైపరీత్యాల్లో పంట నష్టం పొందవచ్చని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకునే అవకాశముంటుందన్నారు.

రాజవొమ్మంగి:అర్హులైన ఎస్సీ ఎస్టీ రైతులు కౌలు రైతు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని రాజవొమ్మంగి వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు కోరారు. ఆయన మాట్లాడుతు రైతు తన పూర్తి వివరాలను రైతు సేవాకేంద్రంలో సమర్పించాలన్నారు. కౌలు కార్డు 11 నెలలు మాత్రమే వర్తిసుందన్నారు.

# వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్


వనుగుమ్మలో ఉపాధి బకాయిలపై నిరసన చేస్తున్న కూలీలు

ముంచంగిపుట్టు: బకాయి ఉన్న ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కె.శంకర్‌రావు డిమాండ్ చేశారు.మండలంలో గల వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో మంగళవారం సీటూ ఆధ్వర్యంలో ఉపాధి బకాయిలపై ఉపాధి కూలీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనుల చేసి నెలలు గడుస్తునా వేతనాలు చెల్లించకపోవడంతో అన్యాయం అన్నారు. పంచాయతీలకు రూ.25లక్షల నుంచి రూ.40లక్షల వరకు బకాయిలు ఉన్నాయని, ఉపాధి వేతనాలు అందకపోవడంతో ఆకలితో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని, కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, పని వేతనాలు పెంచాలని, పని ప్రదేశంలో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు


విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రుద్రరాజు భీమరాజు

మారేడుమిల్లి : విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని మారేడుమిల్లి సీఐ రుద్రరాజు భీమరాజు సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ గిరిజన బాలురు ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ర్యాగింగ్ అనే భూతాన్ని దరిచేరనియవద్దని సూచించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

# గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో నర్సింగరావు

రాజవొమ్మంగి: వర్షాలు కురుస్తుండడంతో వీధుల్లో చెత్త పేరుకొని పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాజవొమ్మంగి ఎంపీడీవో యాదగిరీశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి అధ్యక్షతన స్థానిక సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులు, ఆశ, ఏఎన్ఎం తదితర సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు వీధులను శుభ్రం చేయాలన్నారు. మురుగునిల్వ లేకుండా డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. అందరు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. సీడీపీవో దేవమణి, కార్యదర్శి మల్లేశ్వరరావు, టీడీపీ నాయకుడు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్‌లు

చింతపల్లి(సాక్షి,పాడేరు): గిరిజన రైతులు ఉద్యానవన పంటల సాగు ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ఎంపీపీ కోరాబు అనూషాదేవి కోరారు. ఉపాధి హామీ పథకంలో మండలంలోని 1755 ఎకరాల్లో నాటనున్న పలు రకాల పండ్ల జాతుల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని తాజంగి పంచాయతీ కోరుకొండ గ్రామంలో మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ అనూషాదేవి మాట్లాడుతూ గిరిజన రైతులు ఉద్యానవన పంటల సాగుకు గత ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. మారుమూల గ్రామాల్లో పండ్లతోటల పెంపకంకు గిరిజనుల ఆదరణ పెరిగిందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్, ఎంపీడీవో వీరసాయిబాబు, సర్పంచ్ మహేశ్వరి, ఏపీవో లక్ష్మీనారాయణమూర్తి, ఈసీ మధుసూదన్, పీసీ పుష్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం


చెత్త తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతయ్య


ఏనుగురాయిలో డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ నరసింగరావు

కొయ్యూరు: మండలంలోని కొండగోకిరి పంచాయతీలో ఎంపీడీవో లాలం సీతయ్య మంగళవారం పర్యటించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపునకు ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు ఇళ్ల ముందున్న చెత్తను తొలగించాలన్నారు. నీటిని నిల్వ ఉంచవద్దన్నారు. అనంతరం ఆయన అంగన్‌వాడీ కేంద్రాన్ని, పాఠశాలను సందర్శించారు. సచివాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

ముంచంగిపుట్టు: గ్రామాల్లో గిరిజనులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏనుగురాయి సర్పంచ్ ఎస్.నరసింగరావు అన్నారు.మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ కేంద్రంలో పారిశుధ్య పక్షోత్సవాలు సందర్భంగా పారిశుధ్య పనులు చేయించారు. గ్రామంలో డ్రైనేజ్‌ను శుభ్రం చేయించి, మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు. గిరిజనులతో మాట్లాడి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనారోగ్యానికి గురైతే ఆసుపత్రికి వెళ్లాలని, నాటు మందులు, వైద్యం జోలికి పోవద్దని సూచించారు. మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని లేకపోతే దోమలు పెరిగే ఆస్కారం ఉందన్నారు. వార్డు మెంబర్ రామారావు, పంచాయితీ కార్యదర్శి సింహాద్రి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీలకు డీడీవోలను నియమించాలి


విలేకరులతో మాట్లాడుతున్న సర్పంచ్‌లు రామకృష్ణ, రాంబాబు, నాయకులు

జి.మాడుగుల: మండలంలోని పంచాయతీలకు డీడీవో బాధ్యతలతో పూర్తిస్థాయి అధికారులను నియమించాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు కిముడు రాంబాబు డిమాండ్ చేశారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 17 పంచాయతీల్లో నలుగురు డీడీవోలు మాత్రమే ఉన్నారన్నారు. ఒక్కొక్క డీడీవోకు 4 నాలుగు, 5 పంచాయతీ బాధ్యతలు అప్పగించటం వలన ఏ పంచాయతీలో కూడా పూర్తిస్థాయిలో విధులు నిర్వహించలేకపోతున్నారు. పంచాయతీ ప్రజలకు సంబంధించి జనన, మరణ ఇతర ధృవీకరణ పత్రాలు పొందలన్నా మండల కేంద్రానికి వెళాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న డీడీవోలు పంచాయతీలో ప్రజలకు గాని, సర్పంచ్‌లకు గాని అందుబాటులో ఉండడం లేదన్నారు. ప్రతీ పంచాయతీకి ఒక్కొక్క పంచాయతీకీ ఒకొక్క డీడీవోను నియమించాలని వారు కోరారు. సర్పంచ్‌లు పాల్గొన్నారు.